నినాదం
నిఖార్సైన జర్నలిజం
ఆదివారం 26 జనవరి 2025
తెలంగాణ ప్రాంతీయం
పేజీలు 8

## జర్నలిస్టుల ముసుగులో వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకోవాలి



2

# అక్రమ నిర్మాణాలను..
# అదుపు చేసేదెవరు..?





- అనుమతులు రెసిడెన్షియల్.. కట్టేది కమర్షియల్..
- ఉల్లంఘనల వెనుక రాజకీయ దళారులు.. లంచాలకు మంచాలు వేసే అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి25(నినాదం న్యూస్):** నిర్మాణానికి తగ్గ ముడుపులు ఇస్తే చాలు జీహెచ్ఎంసీ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా భవనాలు కట్టుకోవచ్చు అడిగే వారు.. అటువైపు వచ్చి అడ్డుకునే వారు ఉండరు. ఇది కాప్రా సర్కిల్ పరిధిలో సాగుతున్న భవన నిర్మాణాల తీరు. కాలనీల్లో ప్రధాన రోడ్ల వెంట టౌన్ ప్లాన్ నియమాలకు విరుద్దంగా బహుళ అంతస్థుల భవనాలు వెలుస్తున్నా పట్టించుకొని చర్యలు తీసుకోవలసిన వారు మాత్రం ఎక్కడ కనిపిచరు. కాలనీలు, వ్యాపార సముదాయాల్లో చేపట్టే భవన నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వ నుండి నిర్దిష్ట చట్టాలు ఉన్నాయి. అవేవి పట్టింపు లేకుండా ఉల్లంఘనలకు పాలుపడుతూ బిల్డర్లు, భవన యజమానులు ఇష్టానుసారనగా నిర్మాణాలు చేపడుతున్నారు. వీటిపై సంబంధిత అధికారులు మాత్రం చర్యలు తీసుకోరు. కాప్రా సర్కిల్ పరిధి కుషాయిగూడ, ఏఎస్ రావు నగర్, హెచ్ బి కాలనీ మల్లాపూర్ చర్లపల్లి జీహెచ్ఎంసీ డివిజన్ల పరిధిలో యథేచ్ఛగా అక్రమ బహుళ అంతస్థుల భవనాలు విచ్చల విడిగా వెలుస్తున్నాయి. బిల్డర్లు, భవన యజమానులు టౌన్ ప్లాన్ కార్యాలయం నుండి పొందిన అనుమతులకు చేస్తున్న నిర్మాణాలకు ఎక్కడ పొంతనలు కనిపించవు. తీసున్న అనుమతులు రెండు అంతస్తులకు కట్టేది మాత్రం మూడు నాలుగు అంతస్తులు.. రెసిడెన్షియల్ పర్మిషన్ పొంది, వ్యాపార భవనాలు కడుతున్నారు. పాత రెసిడెన్సిల్ భవనాలను రేనోవేషన్స్ చేసి కమర్షియల్ గా మారుస్తున్నారు. మాస్టర్ ప్లాన్ నియమ నిబంధనలు

మిగతా2లో

## పల్లెవాసుల జీవనశైలికి పట్టం కట్టిన అశోక్‌చిత్రాలు

- గణతంత్ర దినోత్సవం సందర్భంగా చిత్రకారుడిని పలకరించిన 'నినాదం'
- కొడంగల్ ప్రాంత యువ చిత్రకారుడి ప్రస్థానం..
- నిరుపేద చిత్రకారుడి జీవన చిత్రాలు..
- చిరుప్రాయంలోనే అబ్బిన చిత్రకళ..
- మట్టిలో మాణిక్యం సున్నపు అశోక్..
- పలువురి చేత మన్ననలు..

ప్రతిభకు పేద ధనిక తేడా లేదని నిరూపిస్తున్నాడు ఓ యువకుడు.. అంతగా ఉన్నతమైన చదువులు చదువలేకపోయాడు.. కానీ పట్టుదలను పెట్టుబడిగా పెట్టి తనకు ఆసక్తి ఉన్న చిత్రకళవైపు అడుగులు వేశాడు.. ఎలాంటి శిక్షణ లేకపోయినా నేర్చుకోవాలనే తపనతో కళాకారుడిగా ప్రత్యేకతను చాటుకుంటున్నాడు. బ్రతుకుతెరువు కోసం పలు కూలీ పనులు చేస్తూ. కుటుంబ ఆర్థిక బాధ్యతలను తన భుజాలపై మోస్తూ ఖాళీ సమయాలలో అబ్బురపరిచే చిత్రాలు వేస్తూ పలు సూక్ష్మ కళాకృతులు తయారు చేస్తూ అందరిని ఔరా అనిపిస్తున్నారు.

వివరాలు 5లో



అశోక్ చేతిలో ఒదిగిన శ్రమజీవుల చిత్రాలు



పెన్సిల్ తో గీసిన రాష్ట్ర ముఖ్యమంత్రి గవర్నర్ చిత్రాలు

## నకిలీ నోట్లను విక్రయిస్తున్న ముఠా అరెస్టు

- ఎనిమిది మంది అరెస్ట్..
- అసలు, నకిలీ నోట్లు, ముద్రణ యంత్రం, కారు, ఆటో, సెల్ ఫోన్లు స్వాధీనం..
- పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా
- నిందితులను పట్టుకున్న సిబ్బందికి అభినందనలు..





**వరంగల్ ప్రతినిధి, (నినాదం న్యూస్):** లక్షకు నాలుగు రెట్లు అధికంగా నకిలీ నోట్లు అందజేస్తామని నకిలీ నోట్ల విక్రయాలకు పాల్పడుతున్న ఎనిమిది మంది ముఠా సభ్యులను కేయూసీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి రూ. 38.84 లక్షల అసలు నోట్లతో పాటు, రూ.21 లక్షల నకిలీ నోట్లు, ముద్రణకు అవరమైన తెల్లకాగితాలు, కారు, ఆటో, తొమ్మిది సెల్‌ఫోన్ల స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మణికాల కృష్ణ, దరామ్సోత్ శ్రీను, తేజావత్ శివ, గుగ్లోత్ వీరన్న,

మిగతా2లో

## పిసిసి అధ్యక్షుడిని కలిసిన జగన్ నాయక్



**మహేశ్వరం, జనవరి 25 (నినాదం న్యూస్):** శనివారం గాంధీభవన్‌లో పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్, ఇన్కమ్ టాక్స్ కమిషనర్ ప్రకాష్ రాథోడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాడుగుల జంగయ్యలతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జగన్ నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుండి అధికారులకు అందిన ప్రాథమిక సమాచారం మేరకే గ్రామసభలో జాబితాలు విడుదలయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నాయకులు పెద్దలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను ఆదుపు చేసేదెవరు.?

(మొదటిపేజీ తరువాయి..)

ఎక్కడ కూడ పాటిస్తున్న పరిస్థితులు కనిపించవు.. ఇదంత అధికారులు, ప్రజా నాయకుల కనుసన్నల్లో నే జరుగుతున్నాయని, రాజకీయ దళారులు అక్రమ సంపాదనలకు పెద్ద వనరులుగా మార్చుకున్నారని స్థానికంగా ప్రజలు ఆరోపిస్తున్నారు. కాలనీల్లో, ప్రధాన రహదారులపై చేస్తున్న నిర్మాణాలకు సంబంధించి రోడ్ల వైడింగ్ లు, సెట్ బ్యాక్స్, సెల్లర్స్ నిబంధలను పాటిస్తున్న పరిస్థితులు ఎక్కడ కనిపించవని దీంతో బౌషత్ ప్రజలకు అవస్థలు తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయా కాలనీల అభివృద్ధి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై నిత్యం అధికారులకు పిర్యాదులు చేసినా పత్రికలు కథనాలు రాస్తున్నా అధికారులు పెద్దగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవని స్థానికులు మండి పడుతున్నారు. కాప్రా టౌన్ ప్లాన్ కార్యాలయంలో అక్రమార్కులదే రాజ్యమని ఆరోపణలు చేస్తున్నారు. ఇక్కడ ప్రతి అక్రమ నిర్మాణ ఫైలుకు ఒక లెక్క ఉంటది. అవి ముట్టాకే ఫైలు ముందుకు కదులుతది. లక్షల్లో లంచాలు తీసుకొని అక్రమ నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్న కాప్రా జీహెచ్ఎంసి అధికారులపై చర్యలు తీసుకోవాలని అభివృద్ధి సంఘాల నాయకులు కోరుతున్నారు.

## దొంతలగుట్ట తండాను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



**మహేశ్వరం, జనవరి 25( నినాదం న్యూస్):** నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం చారకొండ మండలం సారం బండ తండా గ్రామపంచాయతీ పరిధిలోని దొంతల గుట్ట తండాను తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం సారం బండ తండా గ్రామపంచాయతీ నుండి దొంతల గుట్ట తండా వరకు ఒక కోటి రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణం పనులకు ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు గుండె వెంకటేష్ గౌడ్ నాయకులతో కలిసి శంకుస్థాపన పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్దలు అధికారులు ప్రజా ప్రతినిధులు యూత్ కాంగ్రెస్ నాయకులు అభిమానులు రామవత్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టుల ముసుగులో వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకోవాలి

- ఏసీపీని కోరిన కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్
- బోర్ల వద్దకు, సామాన్యులను ఇబ్బందులకు గురిచేయొద్దు
- డబ్బులు డిమాండ్ చేస్తే ఫిర్యాదులు చేయండి
- కూకట్పల్లి ఏసిపి శ్రీనివాసరావు



**కుత్బుల్లాపూర్, జనవరి 25 (నినాదం న్యూస్):** గౌరవప్రదమైన జర్నలిజం వృత్తిని అప్రతిష్టపాలు చేస్తున్న జర్నలిస్టులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూకట్పల్లి ప్రెస్ క్లబ్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కూకట్పల్లి ఏసిపి శ్రీనివాసరావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు ఉందని, జర్నలిస్టులది అతి కీలకమైన పాత్ర అని పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో కొత్త దోరణిలతో జర్నలిస్టుల విలువలు మస్కబారే విధంగా కొందరు ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులకు అండగా నిలవాల్సిన జర్నలిస్టులే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న సంఘటనలు వెలుగు చూస్తుండడం విచారకరమన్నారు. సమాజంలో ఈ పోకడలతో జర్నలిస్టులు అంటే సామాన్యులకు చులకన భావం ఏర్పడుతుందని ఆవేదన చెందారు. జర్నలిస్టుల విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని ఏసిపిని కోరారు. జర్నలిజం ముసుగులో అక్రమ మార్గంలో వసూళ్లకు పాల్పడుతున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. బోర్ల దగ్గరికి, సామాన్యులు ఇల్లు కట్టుకుంటే వారి దగ్గరికి వెళ్లి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఇలాంటి అక్రమాలకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. జర్నలిస్టుల పేరుతో సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏసీపికి జర్నలిస్టులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఉన్న జర్నలిస్టులకు ప్రస్తుతం ఉన్నటువంటి వారికి చాలా వ్యత్యాసం కనిపిస్తుందన్నారు. జర్నలిస్టుల పట్ల సామాన్యులకు చులకన భావం ఏర్పడిందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. బాధితుల వద్ద నుంచి ఫిర్యాదులు అందితే కచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు గడ్డమీది బాలరాజు, ఆర్. కె. దయాసాగర్, తొట్ల పరమేష్, నిమ్మల శ్రీనివాస్, ఎం ఏ కరీం, నవీన్ రెడ్డి, ఏబీఎన్ వేణు, నాగరాజు, క్రాంతి, గంగరాజు, సదా మహేష్, మాణిక్య రెడ్డి, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవచేసే భాగ్యం కలగటం నా నా పూర్వజన్మ సుకృతం

- నగర మేయర్ ధండు నీతు కిరణ్



**నిజామాబాద్ ప్రతినిధి, జనవరి 25 (నినాదం న్యూస్) :** ఐదు సంవత్సరాల కాలంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు సేవ చేసే అవకాశం రావటం నా పూర్వజన్మ సుకృతం అని నగర మేయర్ దండు నీతు కిరణ్ అన్నారు. నగరంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నగర పాలక సంస్థ పాలకవర్గం ఐదు సంవత్సరాల పదవి కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు నిజామాబాద్ నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో మేయర్ మాట్లాడుతూ మేయర్‌గా పనిచేయడం చాలా ఆనందం కలిగించిందని ఈ అవకాశాన్ని కల్పించిన మాజీ నగర ఎమ్మెల్యే బిగాల గణేష్ కుప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ద్వారా ప్రజలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించే క్రమంలో రాత్రినక పగలనక కరోనా విపత్కర పరిస్థితుల్లో కూడా అండగా నిలిచిన మున్సిపల్ అధికారులు, సిబ్బంది కార్మికులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదములు తెలిపారు.

**నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను పాలకులు నిర్లక్ష్యం చేశారు : ఎమ్మెల్యే సూర్యనారాయణ**

రాష్ట్రంలో అతి పెద్ద నగరాలలో నిజామాబాదు మున్సిపల్ కార్పొరేషన్ ఒకటి అయినప్పటికీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం గజ్వేల్‌కి ఇచ్చిన ప్రాముఖ్యం ఇందూర్ కార్పొరేషన్‌కి ఇవ్వలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ కొడంగల్ కి ఇచ్చిన ప్రాముఖ్యం ఇందూర్ కార్పొరేషన్‌కి ఇవ్వడం లేదు. కార్పొరేషన్ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషి చేయాలి. తాను ఎమ్మెల్యే గా గెలిచిన నాటి నుండి నగరంలో పెండింగ్ లో ఉన్న ఇంటిగ్రెటెడ్ మార్కెట్,ఫ్లైఓవర్ పనుల పైన దృష్టి పెట్టడం జరిగిందన్నారు.

**నా హయంలో డెవలప్మెంట్ పనులు జరిగాయి**
**- మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా**

నిజామాబాద్ నగరంలో కమిట్మెంట్‌తో పనిచేసి నిజామాబాద్‌ని అభివృద్ధి పథంలో ఉండే విధంగా చూశాం. మున్సిపల్ 13 కోట్ల విద్యుత్ బకాయాలను కట్టి జీరో చేశాం. నగరంలో ఎక్కడ లేని విధంగా మినీ ట్యాంక్ బండ్, ఐటి హబ్, వైకుంఠధామాలు,అర్బన్ పార్కులు,సెంటర్ మీడియన్స్ లైటింగ్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు,ఓపెన్ జిమ్ములను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇద్రిస్ ఖాన్,కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబెర్స్,కమిషనర్ దీలిప్ కుమార్,ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# నకిలీ నోట్లను విక్రయిస్తున్న ముఠా అరెస్టు

(మొదటిపేజీ తరువాయి..)

కర్నూల్ జిల్లాకు చెందిన బిజిని వేముల వెంకటయ్య, హన్మకొండ జిల్లాకు చెందిన ఎర్రగొల్ల శ్రీనివాస్, ఉడుతా మల్లేష్, ఎర్రగొల్ల అజయ్ ని అరెస్ట్ చేశారు. అరెస్ట్ కు సంబంధించిన సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి... మణికాల కృష్ణ గొర్రెల వ్యాపారం చేసేవాడు. వ్యాపారం ద్వారా వచ్చే అదాయం అవసరాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని ఓ స్కెచ్ వేశాడు. అందులో భాగంగా గొర్రెల వ్యాపారం ద్వారా పరిచయమైన వ్యక్తులతో తనకు అడవిలో డబ్బులతో కూడిన డ్రమ్ము దొరికిందని అందులోని డబ్బు వినియోగిస్తే కుటుంబంలో ఆరోగ్య సమస్యలు, ఇతర సమస్యలు ఎదురౌవుతున్నాయని నమ్మించాడు. తనకు ఎవరైన లక్ష రూపాలు ఇస్తే వారికి డ్రమ్ములోని డబ్బు రెండింతలు ఇస్తానని, లక్ష ఇస్తే నాలుగు రెట్లు అధికంగా నకిలీ నోట్లను ఇస్తానని నమ్మించాడు. ఈ తరహాలోనే హనుమకొండ జిల్లా కేశవాపూర్ గ్రామానికి చెందిన ఎర్రగొల్ల శ్రీనివాస్‌తో పరిచయంతో ప్లాన్‌ను అమలుకు శ్రీకారం చుట్టారు. ప్లానులో భాగంగా పాల్వంచ అడవిలో ముందుగా అసలు, నకిలీ రూపాయల నోట్లతో భద్రపర్చిన డ్రమ్ము నుండి అసలు ఐదు వందల రూపాయల నోట్ల కట్టను ప్రధాన నిందితుడు శ్రీనివాస్‌కు చూపించడంతో అవి అసలు నోట్లని నమ్మిన శ్రీనివాస్ పదిలక్షల అసలు నోట్లకు ఇరువై లక్షల రూపాయలు అలాగే ఐదు లక్షల అసలు నోట్లకు ఇరువై లక్షల రూపాయల నకిలీ నోట్లు మార్పిడి చేసుకొనేందుకు నిందితుల ఇద్దరి మధ్య అంగీకారం కుదిరింది. కానీ తనకు డబ్బును హనుమకొండకు తీసుకొచ్చి ఇస్తేనే ఒప్పందానికి అంగీకరిస్తానని శ్రీనివాస్ షరతు పెట్టడంతో కృష్ణ అంగీకరించాడు. ఒప్పందం ప్రకారం కృష్ణ ప్రస్తుతం అరెస్టు చేసిన మరో నలుగురు నిందితులతో కారులో శుక్రవారం కేయూసీ అవుటర్ రింగ్‌రోడ్డు పెగడపల్లి క్రాడ్ వద్దకు చేరుకోగా అక్కడే వున్న శ్రీనివాస్ మరో ఇద్దరు నిందితులతో కలిసి అసలు డబ్బుతో పాటు నకిలీ నోట్లను మార్పిడి చేసుకుంటున్న తరుణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానం వచ్చి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద వున్న బ్యాగులు, కారులో తనిఖీ చేయడంతో పెద్ద మొత్తంలో అసలుతో పాటు, నకిలీ నోట్లు, ముద్రణకు అవసరమైన తెల్లకాగితాలను గుర్తించి విచారించగా నిందితులందరూ నేరాన్ని అంగీకరించారు. కాగా, గతంలోనే ప్రధాన నిందితుడు ఇదే తరహాలో మరో మిత్రుడితో కలిసి తెల్ల కాగితాలపై ఐదు వందల రూపాయల నోటు ముద్రించి పలుమార్లు విక్రయిస్తూ పోలీసులకు చిక్కడంతో సత్తుపల్లి, వీఎం. బంజర, లక్ష్మీదేవి పేట పోలీస్ స్టేషన్‌ల్లో ఇప్పటికే కేసులు నమోదయ్యాయని విచారణలో తెలిసిందని సీపీ వివరించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఏసీపీ దేవేందర్ రెడ్డి, కేయూసీ ఇన్ స్పెక్టర్ రవి కుమార్, ఎస్ఐ మాధవ్, హెడ్‌కానిస్టేబుల్ నర్సింగ్ రావు, కానిస్టేబుళ్ళు శ్యాంరాజు, సంజీవ్, సంపత్, హెూంగార్డ్ రాజేందర్‌ను పోలీస్ కమిషనర్ అభినందించారు.

## జైనూర్‌లో కళాజాత బృందంతో వ్యాధులపై అవగాహన



**నినాదం ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో :** కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సీతారాం ఆదేశానుసారం జైనూర్ లోని గిరిజన గ్రామాల్లో కళాజాత బృందాల వారిచే పాటలు, నాటకాల ద్వారా అన్ని జాతీయ ప్రోగ్రాంలు మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు,మలేరియా, డెంగ్యూ,చికెన్ గున్యా, ఫైలేరియా,ఎన్ సి డి, సీకిల్ సెల్,తలసేమియా,క్షయ, కుష్టు,ఎయిడ్స్, ఫైలేరియా, వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పరిశుభ్రత,కుటుంబ నియంత్రణ, కిశోర బాలికల పౌష్టిక ఆహారం, బాల్య వివాహాలను అరికట్టడానికి గురించి జైనూర్ పి. హెచ్. సి పరిధిలోని రాసిమెట్ట, బూసిమెట్ట గ్రామాలలో కళాజాత బృందాల వారిచే అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాసుదేవ్ డెమో,పి. హెచ్.సి సిబ్బంది, కళాజాత బృందంతో పాటు పాల్గొన్నారు

## నేడు మండల కేంద్రంలో 4 పథకాలు ప్రారంభం

**- ఎంపీడీవో వీరేశం**



**భీమదేవరపల్లి జనవరి 25 (నినాదం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జనవరి 26 గణతంత్ర దినోత్సవం నుండి అమలు చేయనున్న, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు నాలుగు పథకాలు భీమదేవరపల్లి మండలంలో ఆదివారం ప్రారంభించేందుకు మండల కేంద్రం లో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలో, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పథకాలు ఆదివారం జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రారంభిస్తున్నట్లు ఎంపిడివో వీరేశం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాట్లపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో వీరేశం, తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ లు సమావేశం నిర్వహించారు. ఆదివారం జరిగే ఈ కార్యక్రమం మండల ప్రత్యేక అధికారి అదనపు డి ఆర్ డి ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరగనుంది. ముందుగా సీఎం రేవంత్ రెడ్డి సందేశం ప్రజలకు వినిపించనున్నారు. అనంతరం పథకాలకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందిస్తారు.

## బీఆర్ఎస్ నేతలు చిల్లర వేషాలు మానుకోవాలి

**- జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేగ కళ్యాణి**

**ములుగు ప్రతినిధి, (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమంలో బాగంగా సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుడితే బీఆర్ఎస్ పార్టీ నేతలు చిల్లర వేషాలు వేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రేగ కళ్యాణి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజా పాలనలో నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందజేయాలని ఉద్దేశంతో గ్రామసభలు నిర్వహిస్తుంటే బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామ సభల్లో చిల్లర వేషాలు వేస్తూ లబ్ధిదారులను తప్పుదోవ పట్టిస్తూ రసభాస చేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ మాజీ జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడుతూ ప్రభుత్వంపై, మంత్రి సీతక్కపై అసత్య ఆరోపణలు చేస్తూ లబ్ధి పొందాలని చూస్తుందని, ప్రజలు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా కూడా కావాలని అక్కసుతో గ్రామసభల్లో ప్రభుత్వం వైఫల్యం చెందిందంటూ అసత్య ప్రచారం చేస్తుందని అన్నారు. రాష్ట్ర మంత్రి, ఆదివాసి ముద్దుబిడ్డ పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి సీతక్కను సోయిలేని మంత్రి అనడం పట్ల ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలలో ములుగు జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం, పాలకులు చేసిన అభివృద్ధి శూన్యమని ప్రజలు గమనించి సీతక్కను గెలిపించారని, ఆ విషయాన్ని మర్చి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదు అన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న మంత్రి సీతక్క పై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునే లేదని హెచ్చరించారు.



# నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

- హెల్మెట్ తప్పక ధరించాలి
- ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలి
- మంత్రి కొండా సురేఖ




**వరంగల్ బ్యూరో, (నినాదంన్యూస్):** రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ప్రజల నిర్లక్ష్యంతోనే జరుగుతాయని, వాటిని తగ్గించేందుకు ప్రతి వాహనదరుడు కృషి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ అన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. పోచమ్మ మైదానం నుండి ఎంజీఎం ఆసుపత్రి వరకు నిర్వహించిన రెండు కిలోమీటర్ల ద్విచక్ర వాహన ర్యాలీని సీపీ అంబర్ కిషోర్ ఝాతో కలిసి ప్రారంభించారు. స్వయంగా ద్విచక్ర వాహనాన్ని నడిపారు. మీడియా ప్రతినిధులకు హెల్మెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ను తప్పకుండా ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపవద్దని, వాహనం నడిపే క్రమంలో సీట్ బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్




నియమాలను కచ్చితంగా పాటించాలని తెలియజేశారు. సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ జిల్లా పోలీసు, రవాణా వ్యవస్థ వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి, నెహ్రూ యువ కేంద్ర అధికారి అన్వేష్, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

**మానవత్వం చాటుకున్న మంత్రి**

మంత్రి కొండా సురేఖ తన మానవీయ హృదయాన్ని మరోసారి చాటుకున్నారు. ఓ అధికారిక కార్యక్రమంలో పాల్గొని హన్మకొండకు తిరిగి వస్తున్న క్రమంలో జక్కలొద్ది క్రాస్ రోడ్డు (ఉర్సు గుట్ట) వద్ద యాక్సిడెంట్ జరగడంతో కాన్వాయ్ లోని పోలీసు వాహనంలో గాయపడ్డ ఇద్దరు వ్యక్తులను ఎంజీఎం హాస్పిటల్‌కు పంపించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎంజీఎం సూపరింటెండెంట్ కు ఫోన్ లో ఆదేశాలు జారీ చేశారు.

# సీపీఎం రాష్ట్ర 4వ, మహాసభలను జయప్రదం చేయండి

- సీపీఎం మండల కార్యదర్శి శీలం అశోక్

**జమ్మికుంట, జనవరి 25 (నినాదం న్యూస్) :** ప్రజా ఉద్యమాల సారథి, పేద ప్రజల గొంతుక,సిపిఎం పార్టీ నాల్గవ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి శీలం అశోక్ పిలుపునిచ్చారు. శనివారము జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల సందర్భంగా సూచికగా పార్టీ జెండా ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా శీలం అశోక్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపిఎం) 4 వ మహాసభలు సంగారెడ్డి పట్టణంలో ఈరోజు నుండి 28 వరకు 4 రోజుల పాటు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభలలో గత మూడు సంవత్సరాలలో ప్రజా సమస్యలపై సిపిఎం చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను చర్చించి రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం చేయవలసిన పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించే మతోన్మాత భావజాలానికి వ్యతిరేకంగా ప్రజలను ఐక్యంగా ఉంచి సంఘటితం చేసేందుకు భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు ఆయన చెప్పారు. ఈరోజు సంగారెడ్డి పట్టణ కేంద్రంలో బహిరంగ సభ జరగబోతోంది ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుండి ప్రజలు అధిక సంఖ్యలో హాజరు అవుతారని ఆయన అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఏడవ గ్యారెంటీగా హామీ ఇచ్చిన స్వేచ్ఛ స్వాతంత్రం ప్రజాస్వామ్యం అమలులో బాధ్యతరాహితంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. హామీల అమలు విస్మరించి ప్రజాస్వామిక హక్కులపై నిర్బంధాలు కొనసాగిస్తే గత బిఆర్ఎస్ పార్టీ కి



పట్టిన గతే కాంగ్రెస్ కు పడుతుందన్నారు ఈ మహాసభలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, చర్చించి వాటి పరిష్కార మార్గాలను,ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు. రాష్ట్ర సమగ్రాబివృద్ధి కోసం జరిగే ఈ మహాసభలకు సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బృందాకారత్,బీవీ రాఘవులు, విజయ రాఘవన్ తో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బహిరంగ సభలో ప్రసంగిస్తారని అన్నారు.

ఈ కార్యక్రమం లో మండల కమిటీ సభ్యులు జక్కుల రమేష్ ,వడ్లూరి కిషోర్, నాయకులు సిరికొండ మదనయ్య, మారెపల్లి కిరణ్, కల్లూరి శీను, పుల్ల కర్ణాకర్, సుంకర కుమార్ , కేసారి రమేష్ , వేషాల రమేష్, సుభాష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఈఎఫ్ టీఏ దేశాల నుంచి మరిన్ని పెట్టుబడులు తీసుకొస్తాం

- ట్రేడ్ అండ్ ఎకానమిక్ పార్ట్ నర్ షిప్ అగ్రిమెంట్ (టీఈపీఏ)' పేరిట ప్రత్యేక డెస్క్
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**జనవరి 25 (నినాదం న్యూస్):** యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్(ఈఎఫ్ టీఏ) దేశాల నుంచి మరిన్ని పెట్టుబడులను తెలంగాణకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఆయా దేశాల పెట్టుబడిదారులకు మద్దతుగా నిలిచేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ'లో భాగంగా శనివారం 'ట్రేడ్ అండ్ ఎకానమిక్ పార్ట్ నర్ షిప్ అగ్రిమెంట్(టీఈపీఏ)' పేరిట ప్రత్యేక డెస్క్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 'భారత్, ఈఎఫ్ టీఏ దేశాల మధ్య గతేడాది మార్చిలో ట్రేడ్ అండ్ ఎకానమిక్ పార్ట్ నర్ షిప్ అగ్రిమెంట్ జరిగింది. ఈ ఒప్పందం వల్ల ఈఎఫ్ టీఏ దేశాల నుంచి మన దేశంలోకి రాబోయే 15 ఏళ్లలో సుమారు 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చే అవకాశముంది. పది లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆయా దేశాలు, సంబంధిత కేంద్ర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ఈ పెట్టుబడుల్లో అధికశాతం తెలంగాణకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించాం. ఇందులో భాగంగానే ఆయా దేశాల పెట్టుబడిదారులకు అన్ని రకాలుగా సహకరించేందుకు సింగిల్ విండో మెకానిజంతో పనిచేసే ఈ ప్రత్యేక డెస్క్ ను ప్రారంభించాం' అని మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. 'తెలంగాణ ఇప్పటికే ఐటీ,



లైఫ్ సైన్సెస్ రంగాల్లో గ్లోబల్ లీడర్‌గా ఉంది. మిగిలిన రంగాల్లోనూ నంబర్ వన్ గా నిలపాలని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఎమర్జింగ్ టెక్నాలజీస్ తో పాటు శక్తి, విద్యుత్, టెలి కమ్యూనికేషన్స్, రవాణా, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, విద్యుత్ వాహనాలు తదితర రంగాలపై ప్రధానంగా దృష్టి సారించాం' అని చెప్పారు. కార్యక్రమంలో డా. విష్ణువర్ధన్ రెడ్డి, ప్రత్యేక కార్యదర్శి(ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్), తెలంగాణ గ్లోబల్ ఇన్నోవేషన్ అండ్ ఇన్వెస్ట్ మెంట్ సెంటర్(టీజీఐఐసీ) సీఈవో మధుసూదన్, లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ పాల్గొన్నారు.

# ఓటు వజ్రాయుధం : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్






**మంచిర్యాల ప్రతినిధి, జనవరి 25(నినాదం):** దేశ భవిష్యత్తు ఓటర్ల చేతిలో ఉందని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకొని వినియోగించుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు

శనివారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన 15వ జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ లతో కలిసి పాల్గొన్నారు. భారత ఎన్నికల సంఘం కమీషనర్ రాజీవ్ కుమార్ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1950 జనవరి 25వ తేదీన ఎన్నికల సంఘం స్థాపించబడిందని, ప్రపంచంలోనే మన దేశం అతిపెద్ద ప్రజాస్వామ్యం కలిగి ఉందని అన్నారు. 18-19 సంవత్సరాలు నిండిన యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరు తమ ఓటు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఒక్క ఓటుతో గెలుపు, ఓటములు స్థానాలు మారుతాయని, అతి పెద్ద ప్రజాస్వామ్యం కలిగిన భారతదేశంలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియను విదేశాలు ఆదర్శంగా తీసుకోవడం గర్వంగా ఉందని అన్నారు. తమ ఓటు హక్కు ఖచ్చితంగా వినియోగించుకోవాలని, అర్హత కలిగి ఓటు లేని వారు వారి వివరాలను జాబితాలో నమోదు చేసుకోవాలని తెలిపారు. యువ ఓటర్లు తమ స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు ఖచ్చితంగా ఓటు వేసేలా ప్రోత్సహించాలని అన్నారు. ఎన్నికల సమయంలో అర్హత గల వారు స్వచ్ఛందంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా,ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

అనంతరం 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని “ఓటును మించి ఏమీ లేదు - నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను” అనే నినాదంతో అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. నూతనంగా ఓటు నమోదు చేసుకున్న వారికి ఎపిక్ కార్డులు పంపిణీ చేయడంతో పాటు వృద్ధులు, యువ ఓటర్లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కళాశాలల, పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంత మందికి రేషన్ కార్డులు ఇచ్చారు.. ?

**- పదేళ్లలో ఒక్క వాగ్దానమైె నా నెరవేర్చారా ?**

**- ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు**

**- బీఆర్ఎస్ నేతలపై ఫైర్**



**వరంగల్ బ్యూరో, (నినాదం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల పక్షాన నిలబడి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డ్, ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న మీరు ఎందుకు రెండు పడకల ఇళ్లను అందించలేకపోయారని ప్రశ్నించారు. మీరున్న పదేళ్లలో ఎంత మందికి ఇళ్లు ఇచ్చారు? ఎంత మందికి రేషన్ కార్డులు ఇచ్చారని నిలదీశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్తారని అంటున్న బీఆర్ ఎస్ నేతలకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు 3వ స్థానం కల్పించారని, రానున్న ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కడతారని అని పేర్కొన్నారు. సాక్షాత్తు నాటి ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ నగరానికి వచ్చి ప్రతి ఏటా వరంగల్‌కు ఇస్తామన్న రూ. 300 కోట్ల నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేస్తానని ప్రగల్బాలు పలికిన కేసీఆర్ ఇప్పుడు ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. ఉనికిని చాటే ప్రయత్నం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు రానున్న రోజుల్లో భూస్థాపితం కావడం తథ్యం అన్నారు. ప్రజలు మిమ్మల్ని తరిమికొట్టే సమయం ఆసన్నమైందని, మాజీలంతా పోలీసుల మీద నమ్మకం లేదనడం సిగ్గుచేటన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

# సాయి ప్రియ గ్రీన్ మోటార్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి

**- పర్యావరణంలో కాలుష్య నివారణకు ఎలక్ట్రికల్ వెహికల్స్ మేలు**





**కోదాడ,జనవరి 25(నినాదం న్యూస్):** ప్రజలు పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రికల్ వెహికల్స్ ను కొనుగోలు చేయాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని ప్రమీల టవర్స్ ఎదురుగా అనంతగిరి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముసుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాయి ప్రియ గ్రీన్ మోటార్స్ షోరూంను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎలక్ట్రికల్ బైక్స్ కొనుగోలు చేసే వాహనదారుల కోసం ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలను రద్దు చేసింది అన్నారు. ప్రభుత్వం కల్పించిన రాయితీలను ఈవి వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాణ్యత కలిగిన ఎలక్ట్రికల్ వెహికల్స్ ను విక్రయించి సాయి ప్రియ గ్రీన్ మోటార్స్ పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నేడే అట్టహాసంగా సంక్షేమ పథకాల అమలు

**- అధికారులకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ దిశా నిర్దేశం**



**ములుగు ప్రతినిధి, (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఆదివారం నుండి అట్టహాసంగా అమలుకు శ్రీకారం చుట్టడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ప్రతిష్టాత్మక నాలుగు సంక్షేమ పథకాల అమలు కోసం చేపట్టాల్సిన చర్యల గురించి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాల అమలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి మండలంలో ప్రజాప్రతినిధులను సంప్రదించి వారి సూచన మేరకు ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన ప్రతీ గ్రామంలోనూ పథకాల ప్రారంభోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎలాంటి తప్పిదాలు, గందరగోళానికి తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేదిక, షామియానా, తాగునీరు వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లను చేయాలన్నారు. ప్రజాప్రతినిధులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించాలని, మధ్యాహ్నం ఒంటి గంటకు సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టాలన్నారు. ఎంపిక చేసిన గ్రామంలోనే నాలుగు పథకాల అమలును ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. ముందుగా ముఖ్యమంత్రి సందేశంతో కూడిన వీడియోను ప్రదర్శించాలన్నారు. ఒక్కో పథకానికి ప్రత్యేకంగా ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆహార భద్రత కార్డులకు తహసీల్దార్ నేతృత్వంలో, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపీడీఓ ఆధ్వర్యంలో, రైతు భరోసాకు మండల వ్యవసాయ అధికారి నేతృత్వంలో, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఏపీఓ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. ఆయా పథకాలకు సంబంధించిన లబ్దిదారుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జాబితాలో నూటికి నూరు శాతం అర్హులు మాత్రమే ఉండేలా సరి చూసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనర్హులు ఉండకూడదని అన్నారు. ప్రజాపాలన గ్రామ సభల సంధర్భంగా వచ్చిన దరఖాస్తులను సైతం పరిశీలించి, ఆయా పథకాల కింద అర్హుల పేర్లను జాబితాలో చేర్చాలని, పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలోనే వారికి కూడా పథకాల మంజూరీకి సంబంధించిన ప్రొసీడింగ్స్ అందించాలని కలెక్టర్ సూచించారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా తప్పనిసరి లబ్ది చేకూరేలా చొరవ చూపాలని అన్నారు. అనర్హులకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి విమర్శలు, ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పట్టుదలతో చదవి లక్ష్యం సాధించుకోవాలి

**- ఎంఈఓ పాశం సంజీవరెడ్డి**



**మహాముత్తారం, జనవరి 25(నినాదం):** విద్యార్థులు పట్టుదలతో చదువుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవాలని ఎంఈఓ పాశం సంజీవరెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం ములుగుపల్లి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమావేశం నిర్వహించి పిల్లల భద్రత తల్లిదండ్రుల పాత్ర అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల భద్రతపై తల్లిదండ్రులకే ఎక్కువ బాధ్యత ఉంటుందని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. నేటి బాలలే రేపటి బావి భారత పౌరులని అన్నారు. పదవ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న క్రమంలో విద్యార్థి ప్రగతి మీద నిరంతరం మూల్యాంకనం చేయాలని అన్నారు. విద్యార్థులు సమయ పాలన పాటించేలా శ్రద్ధ తీసుకుంటూ వారి అభ్యున్నతికి కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బోనాల సమత, మండల సమాఖ్య కోశాధికారి రజిత, టీచర్లు దాసరి రాజేంద్రప్రసాద్ సాకారం నాయక్, కామిడి సతీష్ రెడ్డి, చంద్రకళ, పెనుకుల యాదగిరి, సుధాకర్ రెడ్డి, వెంకటేష్ ఆర్ట్ టీచర్ బోనాల వెంకటేష్ పాల్గొన్నారు.

# పల్లె వాసుల జీవనశైలికి పట్టం కట్టిన అశోక్ చిత్రాలు





పెన్సిల్ తో గీసిన రాష్ట్ర ముఖ్యమంత్రి గవర్నర్ చిత్రాలు 11:31 AM

**-కొడంగల్ ప్రాంత యువ చిత్రకారుడి ప్రస్థానం..**
**-నిరుపేద చిత్రకారుడి జీవన చిత్రాలు..**
**-చిరుప్రాయంలోనే అబ్బిన చిత్రకళ..**
**-మట్టిలో మాణిక్యం సున్నపు అశోక్..**
**-పలువురికి చేత మన్ననలు**

(గణతంత్ర దినోత్సవం సందర్భంగా చిత్రకారుడిని పలకరించిన నినాదం)

ప్రతిభకు పేద ధనిక తేడా లేదని నిరూపిస్తున్నాడు ఓ యువకుడు.. అంతగా ఉన్నతమైన చదువులు చదువలేకపోయాడు.. కానీ పట్టుదలను పెట్టుబడిగా పెట్టి తనకు ఆసక్తి ఉన్న చిత్రకళవైపు అడుగులు వేశాడు.. ఎలాంటి శిక్షణ లేకపోయినా నేర్చుకోవాలనే తపనతో కళాకారుడిగా ప్రత్యేకతను చాటుకుంటున్నాడు. బ్రతుకుతెరువు కోసం పలు కూలీ పనులు చేస్తూ. కుటుంబ ఆర్థిక బాధ్యతలను తన భుజాలపై మోస్తూ ఖాళీ సమయాలలో అబ్బురపరిచే చిత్రాలు వేస్తూ పలు సూక్ష్మ కళాకృతులు తయారు చేస్తూ అందరిని అవురా అనిపిస్తున్నారు. పేపరు పెన్సిల్ పెన్నులు, రంగులు, శుద్ధ కుక్కలు, రావి చెట్టు ఆకులు, కోడి గుడ్డు పెంకులు, ఐస్ క్రీమ్ పుల్లలు, టూత్ పిన్నులు, చింత గింజలు, అట్ట ముక్కలు అక్కరకు రాని వస్తువులతో ఆకట్టుకునే కళాకృతులను తయారు చేస్తూ విభిన్నమైన చిత్రకళలో చేసిన సాహసం మాత్రం ఆ మట్టి మనిషిని చెయ్యి తిరిగిన చిత్రకారుడిగా చేసింది.గతం లో తన కళా పరిమాణానికి గాను గౌరవ డాక్టరేట్ బిరుదుకూడా వరించింది. సంకల్పం ఉంటే మారుముల గ్రామం నుండి జాతీయ అంతర్జాతీయ కీర్తిని గడించవచ్చు అంటు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న ఈ యువ చిత్రకారుడు డాక్టర్. సున్నపు అశోక్. నేడు ఈ ఆర్టిస్ట్ పై"ఓ-" ప్రత్యేక కథనం వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలో యాంకి గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్. సున్నపు అశోక్ తను చిత్రకళ సూక్ష్మ చిత్రకళలో మంచి కళా నైపుణ్యని సాధించారు. ఇతడు చిరు ప్రాయంలోనే 3వ తరగతి నుంచే చిత్రకళాపట్ల ఆకర్షితుడైయ్యారు. ఇతడు గీసిన చిత్రాలలో దేశభక్తి దైవభక్తి ఉట్టిపడుతుంది. ఇప్పటికే తన కుంచె నుండి అనేక చిత్రాలు జాలువరాయి ఖాళీ సమయంలో విభిన్నమైన సూక్ష్మ చిత్రకళపై పట్టు సాధించారు. అక్కరకు రాని వస్తువులతో ఆకట్టుకునే కళాఖండాలు తయారు చేస్తూ సందర్భాన్ని బట్టి సందేశాత్మక కళాఖండాలను తయారు చేస్తూ తన ప్రతిభను చాటుతున్నారు. ఎందరో ప్రముఖుల నుండి కళాభిమన్నలు పొందుతున్నారు.ఆర్థికంగా ఇబ్బందులను తట్టుకొని నిలబడేందుకు తనలోని ప్రతిభను నిరూపించుకునేందుకు తను ఇంటర్ మీడియట్ మీద చిత్రకళ లో అయ్యర్ ట్రేడ్ టిటిసి ని పూర్తి చేసుకున్నారు తనకు చిత్రకళ ఉపాధ్యాయుడిగా స్థిరపడాలనే లక్ష్యంతో ఉద్యోగాల అవకాశాల కోసం ఎదురు చూస్తూ ముందుకు సాగుతున్నాడు. తను పుట్టి పెరిగిన మారుమూలపలేలో అయినా తన కళా పరిమళానికిగాను ఓ సంస్థ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పలు అవార్డులు రికార్డులు సొంతం చేసుకుంటున్నా ఈ యువకుడి చిత్రకళ సేవ పలువురికి ఆదర్శనీయమే కాని అతడు చాలా బీద కుటుంబానికి చెందినవాడు ఉన్నత అధికారులు దృష్టి సారించి అతడి కళను గుర్తించి ఆర్థిక పరిస్థితులను నిలదొక్కుకునేలా ఉద్యోగ అవకాశాలు కల్పించి అశోక్ ని ఆదుకోవాలని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు.ఇది ప్రతిభ.. దేశ నలు ములలో గల పలు స్వచ్ఛంద సంస్థలు విభిన్నమైన చిత్రకళలో అశోక్ రానిస్తున్న చిత్రకళ సేవలను గుర్తించి పలు సత్కారాలు అవార్డులు రికార్డులతో పటం కట్టారు. పీవీ నరసింహారావు ఫ్రైడ్ ఇండియా పురస్కారం. నవభారత్ రాష్ట్రీయ జ్ఞానపీఠ పురస్కారం. ఉత్తమ చిత్రకారుడు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్. తెలంగాణ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్. అచీవ్మెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్. ఓరియంటల్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్. ప్రెస్టీజియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్. మహాత్మా గాంధీ నోబెల్ శాంతి పురస్కారం. స్వామి వివేకానంద జాతీయ యువ పురస్కారం. ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ పురస్కారం. మ్యాజిక్ %ఒ%ఆర్ట్స్ హర్యానా యూనివర్సిటీ అనుబంధ సంస్థ మ్యాజిక్ బుక్ రికార్డ్ ప్రతినిధులు తన కళా సేవను గుర్తించి గౌరవ డాక్టరేట్ తో సత్కరించారు.

-కొడంగల్ నినాదం న్యూస్





ప్రధానమోదిని దీవిస్తున్న భరతమాత ఊహ చిత్రం 11:40 AM

# ఇది తెలంగాణ ప్రజలకు అవమానం

**హైదరాబాద్:** పద్మ పురస్కారాల్లో తెలంగాణకు అవమానం జరిగిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గద్దర్ (పద్మవిభూషణ్), చుక్కా రామయ్య (పద్మభూషణ్), అందెశ్రీ (పద్మభూషణ్), గోరటి వెంకన్న (పద్మశ్రీ), జయధీర్ తిరుమలరావు (పద్మశ్రీ) వంటి ప్రముఖులను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకవడం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను అవమానించడమేనని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రులు, అధికారులతో జరిగిన సమావేశంలో ఈ అంశంపై ముఖ్యమంత్రి ఎ..రేవంత్ రెడ్డి చర్చించారు. తెలంగాణకు పద్మ పురస్కారాల్లో జరిగిన అన్యాయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాయాలనే యోచనలో ముఖ్యమంత్రి ఉన్నారు. తెలంగాణ సమాజానికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరటి వెంకన్నలను గుర్తించకపోవడం తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి భంగం కలిగించడమేనని సీఎం పేర్కొన్నారు. 139 మందికి పురస్కారాలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కనీసం అయిదు పురస్కారాలు ప్రకటించకపోవడంపై సీఎం ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# అవినీతి తిమింగలం పార్టీని వీడడంతో పార్టీకి పట్టిన శని వదిలిపోయింది

## బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్



**కరీంనగర్, జనవరి 25(నినాదం న్యూస్ ):**
సునీల్ రావు బిజెపిలోకి వెళ్తున్నాడు అని మేము ఐదు నెలల కిందనే చెప్పామని, అయనది ద్రోహం. రాజకీయ వ్యభిచారం,వెన్నుపోటు. అవినీతిమయమైన చరిత్ర అని చల్ల హరి శంకర్ అన్నారు. అధికార పార్టీలో ఉండాలన్నదే ఆయన తపన అని, తనను నమ్మిన మనిషిని వెన్నుపోటు పొడవడం ఆయన నైజం అని అన్నారు. 2020 మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే గంగుల సహకారంతో... బిఆర్ఎస్ అత్యధిక సీట్లు సాధిస్తే దొడ్డి దారిన మేయరైన చరిత్ర నీది ,ఐదు సంవత్సరాలుగా మంచివాడిగా నటించి ఇప్పుడు నమ్మిన వారిని మోసం చేశావు, అధికారయావతోనే ఇప్పుడు బిజెపి కండువా కప్పుకున్నావు, కానీ నిన్ను మేయర్ గా బోయినపల్లి వినోద్ కుమార్ చేస్తే.,ఐదు సంవత్సరాలు నీకు ఎమ్మెల్యే గంగుల సహాయ సహకారాలు అందించార ని అన్నారు. బోయినపల్లి వినోద్ కుమార్ గంగుల కమలాకర్ దయా దాక్షిన్యాలతో మేయర్ అయి. కరీంనగర్ అభివృద్ధి చేశానని చెప్పిన నువ్వు ఇప్పుడు మాట మార్చడం విచిత్రంగా ఉందని ప్రెస్ మీట్ లో చల్ల హరి శంకర్ అన్నారు.పార్టీ మారడం నీ వ్యక్తిగతం. నీవు పార్టీ మారడాన్ని మేము తప్పు పట్టడం లేదని, కానీ బిజెపిలోకి వెళ్తూ. ఓటమి ఎరగని గంగుల కమలాకర్ పై అనవసరమైన ఆరోపణలు చేసిన నీ నాలుకను కోస్తాం అని మేయర్ పై మండి పడ్డ చల్ల హరి శంకర్ ఈ విలేకరుల సమావేశం లో కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గవర్నర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరణ




**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** ఉత్తమ సహాయ ఎన్నికల ఓటరు నమోదు అధికారిగా ములుగు తహశీల్దార్ ఎన్ విజయబాస్కర్ గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్‌కు అవార్డును అందజేశారు. ఉత్తమ సహాయ ఎన్నికల ఓటర్ నమోదు అధికారిగా భారత ఎన్నికల సంఘం రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ఎన్నికల అధికారిచే గుర్తింపు పొందగా 15 వ జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ ఎన్నికల విధానాల అనుసరణగా ములుగు తహసిల్దార్ ఎన్ విజయ భాస్కర్ గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం పొందారు.

# శ్రీ పాద స్మారక ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన శ్రీ దుద్దిల్ల శ్రీను బాబు

**పలిమెల (నినాదం న్యూస్):** శనివారం మంథని నియోజకవర్గం పలిమెల మండలంలోనీ పలిమెల ప్రభుత్వ పాఠశాలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీశ్రీ దుద్దిళ్ళ శ్రీపాద రావు గారి స్మారకార్థం చక్రవర్తి హాస్పటల్‌లి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో దుద్దిళ్ళ శ్రీను బాబు పాల్గొనీ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని శ్రీను బాబు గారు అన్నారు.ఆరోగ్యం విషయంలో ఎలాంటి ఇబ్బంది ఉన్న మా దృష్టికి తీసుకురావాలని,ప్రజల ఆరోగ్యం విషయంలో పార్టీలకు అతీతంగా కలిసి పనిచేస్తామని, ప్రజలకు ఆరోగ్యం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా తెలిపారు.వైద్య శిబిరం కి వచ్చిన డాక్టర్లు మరియు చక్రవర్తి హాస్పిటల్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మెడికల్ క్యాంపుకు వచ్చిన ప్రజలందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలనీ అన్నారు.

# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

**సూర్యాపేట ప్రతినిధి జనవరి 25 (నినాదం న్యూస్) :**




శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం , ఎన్ సి సి ఆధ్వర్యంలో శనివారం కళాశాల లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డా. వి . వెంకటేశులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ మధుసూదన్, సృజన, ఎన్ సిసి కేర్ టేకర్ వడ్డాణం శ్రీనివాస్, అధ్యాపక సిబ్బంది ,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు






# ఆర్జీ-2 ఏరియా లేడిస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా బొమ్మల కొలువు

**8ఇంక్లైన్ కాలనీ, జనవరి 25, నినాదం న్యూస్.:** ఆర్జీ-2 ఏరియా, 25 జనవరి: ఆర్జీ-2 ఏరియా లేడిస్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్ సిఓఎ క్లబ్ నందు "బొమ్మల కొలువు" ను వైభవంగా ఏర్పాటు చేయడం జరిగినది.ఆర్జీ-2 ఏరియా లేడీస్ అధ్యక్షురాలు వనజా వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమములో ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్, పర్సనల్ జి.వెంకటేశ్వర రెడ్డి సతీమణి సునీత వెంకటేశ్వరరెడ్డి హాజరయ్యారు.హాజరైన అతిధులు జ్యోతి ప్రజ్వలన చేసి, కొబ్బరి కాయలను కొట్టి అమ్మవారికి పూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ బొమ్మల కొలువులో ప్రదాన ఆకర్షణగా నిలిచిన అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఎంతో అందంగా తీర్చి దిద్దారు. తెలంగాణ సంస్కృతి ఉట్టి పడేలా అమ్మవార్లు, సంక్రాంతి లక్ష్మి, గొబ్బెమ్మలు, బోగి మంటలు, బతుకమ్మ, సమ్మక్క సారక్క జాతర, బృందావనం, వన్య (ప్రాణులను సంరక్షించడం, వినాయకుడు, అల్లూరు (గామం, పల్లె వాతావరణం అనే వివిధ రకాల అంశాలపై అవగాహన కలిగేలా బొమ్మలను ఏర్పాటు చేశారు. తెలుగు ప్రజల సాంప్రదాయంగా నిర్వహించే ఈ బొమ్మల కొలువు వేడుకలు ఇప్పటికీ ఏ మాత్రం వన్నె తగ్గకుండా మహిళలందరూ ఉత్సాహంగా నిర్వహించుకోవడం చాలా సంతోషమని డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్, పర్సనల్ జి.వెంకటేశ్వర రెడ్డి సతీమణి శ్రీమతి సునీత వెంకటేశ్వరరెడ్డి అన్నారు. "బొమ్మల కొలువు" నిర్వహించటం వలన అందరికీ మంచి జరుగుతుందని, ధూర్గ మాతా కు మంగళ హారతులు ఇచ్చి అమ్మ దీవెనలు అందరి మీద ఉండాలని కోరారు. ప్రతి ఏటా నిర్వహించే "బొమ్మల కొలువు" ఎంతో రమ్యంగా ఉంటుందని ఆర్జీ-2 ఏరియా లేడీస్ అధ్యక్షురాలు శ్రీమతి వనజా వెంకటయ్య గారు అన్నారు. బొమ్మల కొలువు ను విజయ వంతం చేసిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలియ జేశారు.ఈ కార్యక్రమానికి మరొక విశిష్ట అతిథిగా శ్రీ బానోతు వెంకన్న డిడిఎంఎస్ గారు హాజరైనారు. మొదటి సారి ఈ బొమ్మల కొలువు ను వీక్షించడం ఎంతో ఆనందంగా ఉందని వారు అన్నారు. బొమ్మల కొలువు అందరూ కలిసికట్టుగా మన సంస్కృతి సంప్రదాయాలతో వివిధ రకాల అంశాలపై అవగాహన కలిగేలా బొమ్మలను ఏర్పాటు చేయడం జరిగిందని ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ బి.వెంకటయ్య గారు అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహువానితులను ఎంత గానో అలరించాయి. ఇంకా ఈ కార్యక్రమములో వివిధ ఏరియాల జియంలు వారి సతీమణులు అలివేణి సుధాకర రావు, విజయలక్ష్మీ వెంకటేశ్వర్లు, మాలతి సూర్యనారాయణ, లలితా గుప్తా, అనిత లలిత్ కుమార్, వాణి శ్రీనివాస్ రెడ్డి మరియు లేడిస్ క్లబ్ సెక్రెటరి కల్పనా, సభ్యులు సృజన, శోభన, మంజుల, లతా,కవిత, మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గోన్నారు. జీఎం రక్షణ ఆర్జీ రీజియన్ కెహెచ్ఎన్ గుప్తా, జీఎం రేస్క్యూ శ్రీనివాస్ రెడ్డి, ఓసిపి3 ప్రాజెక్ట్ అధికారి ఎస్.మధుసూదన్, ఏజెంట్ ఏ.నెహ్రూ, ఎస్ఓ టు జీఎం ఏం.రాముడు, డీజీఎం వర్క్ షాప్ ఎర్రన్న, ఏరియా రక్షణ అధికారి ఎస్.సంతోష్ కుమార్, డీజీఎం సివిల్ ధనుంజయ, డీజీఎం ఐఇ మురళీకృష్ణ, డిజిఎం (పర్సనల్) అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్, సర్వే అధికారి బుక్య దేశాయి, మెడికల్ సూపరిం టెండెంట్ డా.మహిపాల్, రేస్క్యూ సూపరింటెండెంట్ మాధవ రావ్, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, సీనియర్ ఎస్టేట్స్ అధికారి సునీత ఫారెస్ట్ అధికారి నవిన్ కుమార్ పాల్గొన్నారు.






### ప్రభుత్వ వైఫల్యాలను

# ఎత్తు చూపడానికేనా గ్రామసభలు

**నర్సంపేట జనవరి 25(నినాదం న్యూస్ ):** గత ప్రభుత్వం విపల్యాలను ఎండగట్టడానికే గ్రామ సభలను నిర్వహించడం జరుగుతుందని ఎం సిపిఐయు జిల్లా కార్యదర్శి పెద్దాపురం రమేష్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ఎన్నికల హామీలను ప్రచారం చేసుకొని ప్రజలను మభ్య పెట్టి స్థానిక ఎన్నికలకోసం అని ఎంసిపిఐ యు జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల హామీలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా అర్హులందరికీ తక్షణమే పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వం ప్రకటించిన అర్హులందరిని సమీకరించి ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. ఈరోజు భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) వరంగల్ నగర కమిటీ సమావేశాల సందర్భంగా ఓంకార్ భవన్ లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి 14 నెలలు కావస్తున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని ఇంకా ఎన్నికల ప్రచార అస్త్రాలు గానే ఉన్నాయి తప్ప ప్రజలకు



మాత్రం అందని ద్రాక్ష గానే మిగిలాయని అర్హులందరికీ పథకాలు వర్తిస్తాయని చెప్తున్న ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తారో చెప్పకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎంతో చారిత్రాత్మకమైన వరంగల్ జిల్లాను రాష్ట్ర రెండో రాజధానిగా గుర్తిస్తామని చెప్పి ఇంతవరకు ఎలాంటి కార్యాచరణ చేపట్టకపోవడం అన్యాయం అన్నారు. వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక నిధులు సాధించాలని కోరారు. అజంజాహి మిల్లు తరహాలో వేలాదిమందికి ఉపాధి కల్పించే విధంగా భారీ పరిశ్రమను వరంగల్ పట్టణంలో నెలకొల్పాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పేదల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను రెగ్యులర్ చేసి ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న రియాల్టర్లపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రచార ఆర్భాటాలు మాని ఎన్నికల హామీలను అమలు చేసి చిత్తశుద్ధి ప్రదర్శించాలని లేకపోతే గత పాలకులకు ఏ విధమైన పరిస్థితి వచ్చిందో అదే గుణపాఠం ఈ ప్రభుత్వానికి తప్పదన్నారు. వివిధ తరగతుల ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై ఎన్నికల హామీలపై ప్రణాళికా బద్ధంగా పోరాడుతామని తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్ నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ నగర నాయకులు ఐతం నాగేష్ పరిమళ గోవర్ధన్ రాజు ఎగ్గేని మల్లికార్జున్ అప్పన్నపూరి నరసయ్య పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే చేతుల మీదుగా

# కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**జమ్మికుంట, జనవరి 25 (నినాదం న్యూస్):** ఇల్లంతకుంట మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అందజేశారు. శనివారం ఇల్లందకుంట మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ రాణి ఆధ్వర్యంలో కల్యాణ లక్ష్మి షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మండలంలోని 29 జంటలకు మంజూరైన కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి సంక్షేమ పథకాలు సకాలంలో అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన



హామీలను కచ్చితంగా నెరవేర్చాలని అసెంబ్లీ సాక్షిగా మాట్లాడినందుకు తనపై కేసులు పెడుతూ పోలీస్ స్టేషన్ కు తరలిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినప్పటికీ ప్రజల పక్షాన నిలబడి వారి గొంతుకగా కచ్చితంగా మాట్లాడతానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కందాల కొమురెల్లి, నాయకులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**భూపాలపల్లి, జనవరి 25 (నినాదం న్యూస్):** 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని డా బిఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో జాతీయ పతాక ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగం, తదుపరి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ సేవలందించిన జిల్లా అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందచేయుట తరువాత ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలన, అసెట్స్ పంపిణీ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది ఉదయం 8.30 గంటలకు క్రీడా మైదానానికి చేరుకోవాలని ఆయన సూచించారు. మినిట్ టూ మినిట్ కార్యక్రమం సజావుగా జరిగేలా అనౌన్స్ మెంట్ చేయాలని చెప్పారు

# వడ్డెర సంఘం రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు సాతాల గోపాల్ జన్మదిన వేడుకలు







## హాజరైన వడ్డెర సంఘం జాతీయ నాయకులు

**కుత్బుల్లాపూర్, జనవరి 25 (నినాదం న్యూస్)** వడ్డెర సంఘం రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు శాతాల గోపాల్ జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, వడ్డెర సంఘం జాతీయ రాష్ట్ర నేతలు, అభిమానులు, కుల బాంధవుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకలకు అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు. వేముల లక్ష్మణ్, జాతీయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుంజ శ్రీనివాస్, జాతీయ మహిళా అధ్యక్షురాలు వేముల తిరుమల దేవి, రాష్ట్ర మహిళా అధ్యక్షులు కుంచపు రమ మెడిటేషన్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి. ఇడగోటి పార్వతి, గ్రేటర్ అధ్యక్షులు. రేపని గిరిబాబు, గ్రేటర్ యువజన అధ్యక్షులు చిన్న, మేడ్చల్ జిల్లా యువజన అధ్యక్షులు చలువ మురళి హాజరై సాతాల గోపాలకు శాలువాలు కప్పి మిఠాయిలు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జాతీయ, రాష్ట్ర నేతలు, వడ్డెర కుల బంధువులందరికి శాతాల గోపాల్ పేరుపేరునా ధన్యవాదములు తెలిపారు.

# ఆసిఫ్ ఆధ్వర్యంలో సంధల్‌లో పాల్గొన్న సొంటిరెడ్డి పున్నారెడ్డి

**కుత్బుల్లాపూర్, జనవరి 25 (నినాదం న్యూస్)** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజుల రామారం125 డివిజన్ పి పి నగర్ లో ఆసిఫ్ ఆధ్వర్యంలో సంధల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ



కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రషీద్ బేగ్, లాల్ మహమ్మద్ , శ్రీధర్ వర్మ,



వాసిం, కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు.

## టీజీవిపి నూతన కాలమాని ఆవిష్కరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



**నిజామాబాద్ ప్రతినిధి, జనవరి 25 (నినాదం న్యూస్ ) :** తెలంగాణ విద్యార్థి పరిషత్ 2025 నూతన క్యాలెండర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి మరింత కృషి చేయాలని విద్యార్థులకు ఎటువంటి లోటుపాట్లు ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా ప్రయత్నం చేయాలని తెలిపారు. సామాజిక అంశాల పైన, న్యాయపరమైన అంశాల పైన, అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి విద్యార్థులలో ఆ అంశాలపై చైతన్యం తీసుకొచ్చి వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి విద్యార్థి సంఘంగా పనిచేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు సజ్జనం భానుచందర్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్, బోధన్ డివిజన్ అధ్యక్షుడు మీసలే నగేష్ ,నగర అధ్యక్షుడు అఖిల్ చారి, సుజిత్, వీరేష్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ...

**నిరుపేద కుటుంబాలకు అండగా ప్రభుత్వం**

**కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి....**



కోదాడ,జనవరి 25(నినాదం న్యూస్): అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురికి ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా మంజురైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి శనివారం పంపిణీ చేశారు.నియోజకవర్గ వ్యాప్తంగా కోటి రెండు లక్షల 66 వేల రూపాయలు. 287 చెక్కులు బాధితులకు పంపిణీ చేసినట్లుగా తెలిపారు.. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వరప్రసాద్ రెడ్డి, ముసుకు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఇర్ల సీతారాంరెడ్డి, సుమన్ రెడ్డి, నారపురెడ్డి, శేషు, పూర్ణ, జొన్నలగడ్డ కోటేశ్వరరావు, కనగాల వీరయ్య, గాదే వెంకన్న, గాదె రామారావు, పాలకి సురేష్, బండి చిన్న కోటయ్య, ఆయా గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నడిగూడెం కోటలోనే మువ్వన్నెల జెండా రూపకల్పన...

### ముువ్వన్నెల పతాకం మొగ్గతొడిగిన నడిగూడెం కోట



కోదాడ/నడిగూడెం, జనవరి 25(నినాదం న్యూస్): భారతీయుల ఏకత్వానికి, శౌర్యానికి, స్వాభిమానానికి, సార్వభౌమత్వానికి, సమున్నతకి ప్రతీకగా నిలిచిన త్రివర్ణ పతాకం రూపుదిద్దుకున్నది సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రంలోని రాజావారి కోటలోనే. అంతటి శక్తి కలిగిన పతాకాన్ని రూపొందించిన స్వాతంత్ర సమరయోధుడు, చరితార్థుడు పింగళి వెంకయ్య.... స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారిని తరిమికొట్టేందుకు దేశాన్నంతటిని ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు ఒక జెండా ఉండాలని మహాత్మాగాంధీ తలంచారు. ఎందరో మేధావులు రకరకాల జెండాలను అప్పుడు జరుగుతున్న సమావేశాలు, సభల్లో మహాత్ముడికి చూపించారు. అయితే పింగళి వెంకయ్య రూపొదించిన జెండా గాంధీజీని ఆకర్షించింది.నడిగూడెం రాజా వారి కోటలో జమిందారు రాజనాయిని వెంకటరంగరావు జమానా లో 1909 నుంచి 1929 వరకు వ్యవసాయ అధికారిగా పని చేసిన పింగళి వెంకయ్య ఈ కోటలోనే జాతీయ జెండా రూపొందించాడు. 1913 నుంచి జాతీయ జెండాకు నమునాలు మొదలు పెట్టగా 1916 లో లక్నోలో, 1919లో జలంధర్‌లో నమూనా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. తెలుపు, ఆకుపచ్చ, కాషాయం రంగులతో మధ్యలో నూలు ఒలికే రాట్నంతో రూపొందిన జాతీయ జెండాను 1921 మార్చి 31 ఏప్రిల్ 1న అప్పటి మద్రాసు ఉమ్మడి రాష్ట్రం కింద ఉన్న నాటి బెజవాడ( విజయవాడ)లో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలో పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాను జాతిపిత మహ్మా త్మాగాంధీ ఆమోదించారు. స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి పోసిన మువ్వెన్నల జెండా 1947 స్వాతంత్ర్యం అనంతరం నెహ్రూ సమక్షంలో జరిగిన రాజ్యాంగసభలో మూడు రంగుల జెండాలోని నూలు ఒలికే రాట్నాన్ని తీసేసి దాని స్థానంలో ఆశోకచక్రాన్ని చేర్చి అధికారికంగా జాతీయ జెండాగా ఆమోదించారు. పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాకు వందేళ్లకు పైగా పూర్తయినా నేటికీ వెంకయ్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించకపోవడం జాతీయ పతాక శతాబ్ది ఉత్సవాలను నిర్వహించడానికి ముందు రాకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పింగళిని గుర్తించని ప్రభుత్వాలు..**

నడిగూడెం కోటలో జాతీయ జెండా రూప కల్పన జరిగి వందేళ్లు పైగా నిండినా పింగళికిగాని చారిత్రక నేపథ్యం ఉన్న కోటకుగాని గుర్తింపు లేకుండా పోయింది. గడిలో పింగళి విగ్రహం కాని, ఆయన పేరిట మ్యూజియంగాని ఏర్పాటు చేయలేదు. జమిందారు వారసులు నగరాలకు వలసవెళ్లారు. 2007లో పింగళి పేర రూ.5 ల స్టాంపును కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినా అది ఇక్కడ వాడుక లో లేదు. ప్రపంచ ఖ్యాతి కలిగిన కోట విశిష్టతను నడిగూడెం చరిత్రను భావితరాలకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

**'పత్తి' వెంకయ్య.. పతాక శిల్పి**

కృష్ణా జిల్లా మువ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామానికి చెందిన పింగళి వెంకయ్య వ్యవసాయ శాస్త్రంలో పట్టభద్రుడు. జర్మనీలో పీహెచ్‌డీ చేశా రు. గనులు, వజ్రాల శాస్త్రంలో నిపుణుడైన ఆయన ఆధునిక వ్యవసాయంపై పరిశోధనలు చేస్తుండే వారు. నడిగూడెం జమిందారు రాజ నాయిని వెంక టరంగారావు బారిస్టర్ చదువులు, కోర్టు కేసులు స్వాతంత్ర ఉద్యమంలో పనిచేస్తూ ఆధునిక వ్యవ సాయ గ్రంథాలను రచించారు. ఆ కాలంలో మహత్మాగాంధీతో ఉన్న ఉద్యమ నేపథ్యం పింగిళికి రాజావారి మధ్య స్నేహం ఏర్పడింది. దీంతో 1909 లో రాజావారు పింగిళిని నడిగూడెం కోటకు తీసుకువచ్చి ఈ ప్రాంతంలో నూతన పత్తి వంగడా ల సాగుపై రైతులకు వ్యవసాయ విజ్ఞానాన్ని అందించారు. రైతులను ఆధునిక సాగు వైపు చైతన్యం చేస్తూ పత్తి వెంకయ్యగా పేరు గాంచిన పింగళిని వ్యవసాయాధికారిగా జమిందారు నియమించారు. అప్పటి నుంచి 1929 వరకు ఇక్కడే పనిచేశారు. జాతీయ జెండాకు కోటలోనే రూప కల్పన చేశారు.

## ఘనంగా గుడిమల్కాపూర్ డైరెక్టర్ పాండు యాదవ్ కు సన్మానం



**చేవెళ్ల జనవరి 25 (నినాదం న్యూస్):** చేవెళ్ల మండలం కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో నూతనంగా గుడిమల్కాపూర్ డైరెక్టర్గా ప్రమాణస్వీకారం చేసిన తంగడపల్లి గ్రామానికి చెందిన పెద్ద గొల్ల పాండుకు కురుమ సంఘం ఆధ్వర్యం ఘనంగా సన్మానించారు.. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ.. తమకు మార్కెట్ కమిటీలో అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కాలె యాదయ్యకు, కురుమ బాంధవులకు ఎంపికకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే నాపై నమ్మకంతో పదవికి న్యాయం చేస్తూ రైతులకు ఎల్లప్పుడు అండగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలోని..రంగారెడ్డి జిల్లా కురుమ సంఘం ఉపాధ్యక్షులు రాపోలు నరసింహులు, చేవెళ్ల మండల కురువ సంఘం అధ్యక్షులు కసిరే వెంకటేష్, ఉపాధ్యక్షులు దండు సత్యం, ప్రధాన కార్యదర్శి, తిరుమల కుమార్, సహ కార్యదర్శి కుర్వ మల్లేష్, గౌరవ అధ్యక్షులు బిఆర్ఎస్ చేవెళ్ల మండల అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ గుండాల రాములు, PSCS వైస్ చైర్మన్ ఎర్ర మల్లేష్, గుత్తి మల్లేష్, ఎదిరే రాములు, జీ.రాఘవేందర్ శ్రీనివాస్, మల్లేష్, గాంధీ, దయాకర్, విజయ్, శ్రీకాంత్, శ్రీనివాస్,హరీష్ సత్యనారాయణ, నవీన్, మహిపాల్,మరియు చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్‌చైర్మన్ రాములు, మాజీ సర్పంచ్ విట్టలయ్య, కురుమ సంఘం మరియు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి మండల అధ్యక్షులుకి సన్మానం



**చేవెళ్ల జనవరి 25( నినాదం న్యూస్):** చేవెళ్ల మండల బిజెపి మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి నూతనంగా ఎన్నికైన నేపథ్యంలో ఓబీసీ జిల్లా కార్య వర్గ సభ్యుడు చీర శ్రీనివాస్ మర్యాదపురం కలిశారు. అనంతరం శాలవతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే భారతీయ జనతా పార్టీ సంస్థ గత విషయాల గురించి చర్చించారు. పార్టీ బలోపేతాన్నికి కృషి చేస్తానని పార్టీ అధ్యక్షుడు అనంతరెడ్డిగారు తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు సామా విట్టల్ రెడ్డి కరికే సత్యనారాయణ కరికిరవీందర్ జూలూరు నరేందర్ గౌడ్ బండారు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## వైరాలో హైడ్రా ఏర్పాటు చేయాలి

**చెరువులు,ప్రభుత్వ భూములు కాపాడాలి తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు**



**వైరా, జనవరి 25 (నినాదం న్యూస్)** వైరా పరిధిలో చెరువులు కుంటలు ప్రభుత్వ భూములు కాపాడేందుకు హైదరాబాద్ తరహా హైడ్రా ఏర్పాటు చేయాలి అని తెలంగాణ రైతుసంఘం జిల్లాకార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు.శనివారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా మున్సిపాలిటీ పరిధిలో కబ్జాలకు గురి అయిన చెరువులు ప్రభుత్వ భూములు పరిశీలన చేశారు.ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వైరా రిజర్వాయర్ తోపాటు వందల ఎకరాల ప్రభుత్వ భూములు చెరువులు భూములు కబ్జా చేసి నీటి నిల్వ సామర్థ్యం తగ్గి చివరి భూముల పంటలకు నీరు అందడం లేదు అన్నారు కోట్ల రూపాయలు విలువచేసే భూములు కబ్జా చేసి విక్రయం చేస్తున్నారు అని అన్నారు ప్రైవేట్ వ్యక్తులు నుంచి ప్రభుత్వ భూములు కాపాడేందుకు హైదరాబాద్ తరహా వైడ్రా ఏర్పాటు చేయాలి అని కోరారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం పట్టణ కార్యదర్శి చింత నిప్పు చలపతిరావు సంక్రాంతి నర్సయ్య వడ్లమూడి మధు పాసంగులపాటి రవి మోదుగు వెంకట్ ఖాసిం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ లింగయ్య






**నారాయణపేట జిల్లా బ్యూరో, (నినాదం న్యూస్)** జనవరి 25:శనివారం ఉదయం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో జనవరి 26 గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను డీఎస్పీ ఎన్. లింగయ్య పోలీసు అధికారులతో కలిసి పరిశీలించి గణతంత్ర దినోత్సవ వేడుకలకు వచ్చే ప్రజలకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అవసరమైన నీరు, తదితర ఏర్పాట్లను ఏర్పాటు చేయాలని, సాయుధ పోలీస్ బలగాల పరేడ్ ను మరియు పరేడ్ గ్రౌండ్లో బందోబస్తు ఏర్పాట్ల పై పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐ. శివ శంకర్, ఆర్ఐ. నరసింహ, ఎస్ఐ. వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం దిశగా దేశం పయనం

**ఈ గణతంత్రం మనకు ప్రత్యేకం**

**విముక్తి ప్రదాతలను స్మరించుకునే సమయం**

**జాతికిచ్చిన సందేశంలో రాష్ట్రపతి ముర్ము**



**న్యూఢిల్లీ:**ఈ గణతంత్ర దినోత్సవం మనకు మరింత ప్రత్యేకమైందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అవుతోంది. దేశం మొత్తం గర్వించదగిన సందర్భం ఇది. మన లక్ష్యాల దిశగా నిజమైన ప్రయాణం సాగుతోందని ఆమె అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించారు. 'అంతర్జాతీయంగా నాయకత్వం వహించేలా భారత్ ఎదిగింది. భరతమాత విముక్తి కోసం త్యాగాలు చేసిన వారిని స్మరించుకోవాల్సిన తరుణమిదని అన్నారు.. ఈ ఏడాది బిర్సా ముండా 150వ జయంతిని జరుపుకొన్నాం. వెలుగులోకి రాని మరికొందరు ధైర్యవంతులను స్మరించుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలు మార్చుకు న్నాం. ఈ ఏడాది కొత్త చట్టాలు రూపొందించి అమల్లోకి తెచ్చాం' అని రాష్ట్రపతి తెలిపారు. ఎన్నో ఏళ్ల పోరాటం తర్వాత 1947 ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి మనకు స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, 1950 జనవరి 26న భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చింది. మనం ఈరోజు స్వేచ్ఛగా బతుకుతున్నా మంటే స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుల చలవే. అయితే ఈ విషయం గురించి చాలా మందికి తెలియకపోవడం విచారకరం. అలాగే 1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమల్లోకి వచ్చింది... కాబట్టి ప్రతి ఏటా ఇదే రోజున రిపబ్లిక్ డే జరుపుకుంటున్నామని భావిస్తారు. ఇందులో కాస్త నిజం లేకపోలేదు. అయితే దీని వెనుక బలమైన కారణం ఉంది. వాస్తవానికి భారత రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26నే ఆమోదించారు. దీనిని అమలు చేసే తేదీకి ఒక ప్రాముఖ్యత ఉండాలనే ఉద్దేశంతో రెండు నెలలు వేచి ఉన్నారు. లాహోర్ వేదికగా 1930 జనవరి 26న కాంగ్రెస్ పార్టీ జాతీయ సమావేశంలో తొలిసారిగా సంపూర్ణ స్వరాజ్యం తీర్మానం చేశారు. నెహ్రూ సారథ్యంలో రావీ నది ఒడ్డున త్రివర్ణ పతాకం ఎగురవేసి భారతీయుల స్వాతంత్ర సంకల్పాన్ని బ్రిటిషర్లకు గట్టిగా వినిపించారు. అప్పటి దాకా కేవలం రాజకీయ, ఆధ్యాత్మిక స్వాతంత్రం వస్తే చాలు, సంపూర్ణ అధికారం బ్రిటిష్ వారి చేతుల్లోనే ఉండి, దేశం సామంత రాజ్యంగా మిగిలిపోయినా ఫర్వాలేదనుకునేలా ఉన్న రాజకీయ నేతల వైఖరిని జలియన్‌వాలాబాగ్ ఉదంతం ఒక్కసారిగా కళ్లు తెరిపించింది. ఆ÷ూడు సుభాష్ చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ లాంటి నేతలు కాంగ్రెస్ పార్టీలో వేడి పుట్టించి పూర్ణ స్వరాజ్య తీర్మానం ప్రకటన చేయించడంలో సఫలమయ్యారు. ఆ రోజునే స్వాతంత్ర దినోత్సవంగా పరిగణించాల్సిందని కాంగ్రెస్ పార్టీ కూడా దేశ ప్రజలకు పిలుపు ఇచ్చింది. జనవరి 26, 1950 నుంచి బ్రిటీష్ కాలం నాటి భారత ప్రభుత్వ చట్టం -1935 రద్దయ్యింది. భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించింది. దేశానికి రాజ్యాంగం ఉండాలని భావించిన నాటి దార్శినికులు, మేధావులు రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అధ్యక్షుడిగా డాక్టర్ బాబూ రాజేందప్రసాద్‌ను ఎన్నుకోగా, రాజ్యాంగ రచనా ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను నియమించారు. ÷ూజ్యాంగ రచనకు ఎంతోమంది మేధావులు వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, అధ్యయనం చేసి ప్రజాస్వామ్య విధానంలో రూపొందించారు. అనేక సవరణల అనంతరం, 1949 నవంబర్ 26న దీనిని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. భారత రాజ్యాంగాన్ని రూపొందించేందుకు రెండు సంవత్సరాల, 11 నెలల, 18 రోజుల కాలం పట్టింది. రాజ్యాంగ రచనకు మొత్తం రూ.64 లక్షలు ఖర్చయ్యింది. తొలి గణతంత్ర దినోత్సవం నాటికి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ భారత రాష్ట్రపతిగా ఉన్నారు. రాజ్యాంగం అమలైన తర్వాత ఆయన ప్రస్తుత పార్లమెంట్ దర్బార్ హాల్‌లో రాష్ట్రపతిగా ప్రమాణం చేశారు. ఐదు మైళ్ల పొడవున సాగిన పరేడ్ తర్వాత, ఆయన ఇర్విన్ స్టేడియంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అప్పటినుంచి ప్రపంచ దేశాల కూటమిలో సంపూర్ణ స్వతంత్ర దేశంగా భారత్ చేరింది.

# జాతీయ ఓటర్ల దినోత్సవం.. పలువురు కలెక్టర్లకు అవార్డులు

**విజయవాడ:**రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఉత్తమ ఆర్వోగా అవార్డు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర కూడా జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి అవార్డులు స్వీకరించారు. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశకు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు-2024 లభించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. అత్యంత పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన, అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు నిర్వహించే వినూత్న కార్యక్రమాలు, ఓటర్లను జాగృతం చేయడం తదితర అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు కలెక్టర్ లక్ష్మీశ ఈ అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న లక్ష్మీశను సీఎస్ విజయానంద్‌తో పాటు మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ డా. నిమ్మగడ్డ రమేష్ కుమార్, జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా అధికారులు అభినందించారు.

## విద్య వైద్య రంగాన్ని బలోపేతం చేయాలి

## బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్



నిజామాబాద్ ప్రతినిధి, జనవరి 25 (నినాదం న్యూస్ ) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్య రంగాన్ని బలోపేతానికి తగిన నిధులు కేటాయించాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) (బిఎల్ పి)రాష్ట్ర అధ్యక్షులు,బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. బిఎల్ఎఫ్ 7వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్ పి జిల్లా కార్యాలయం వద్ద జరిగిన బిఎల్ఎఫ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య, వైద్య రంగ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లను, సిబ్బంది నియమించాలని డిమాండ్ చేశారు.సంక్షేమ పథకాలతో పాటు విద్య వైద్య రంగాన్ని బలోపేతానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బిఎల్ఎఫ్ రాష్ట్ర కమిటి నాయకులు మేత్రి రాజశేఖర్, జిల్లా కన్వీనర్ కె. శ్రీనివాస్, జిల్లా నాయకులు జె.సత్యనాలయణ, నగర కమిటి నాయకులు అనిల్ ,స్వాతి, కపీల్, జీజాబాయి, రాధా బాయిలతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## గణతంత్ర దినోత్సవ వేడుకలు

**పోలీస్, శౌర్యపతకాల ప్రకటన**

న్యూఢిల్లీ: 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా 942 మంది పోలీసు, అగ్నిమాపక, పౌర రక్షణ సిబ్బందికి వివిధ విభాగాల్లో శౌర్య, సేవా పతకాలు అందించనున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. వీటిలో 95 శౌర్య పతకాలు ఉన్నట్లు తెలిపింది.ఈ అవార్డు గ్రహీతలలో పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు మరియు సివిల్ డిఫెన్స్ సిబ్బంది, కరెక్షనల్ సర్వీసెస్ సేవల్లో పనిచేస్తున్న వారు ఉన్నారని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో మోహరించిన 28 మంది, జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో 28 మంది, ఈశాన్య ప్రాంతంలో ముగ్గురు, ఇతర ప్రాంతాల్లో 36 మందిని గ్యాలంటరీ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపింది ప్రభుత్వం. 101 రాష్ట్రపతి పతకాలలో 85 పోలీసు సిబ్బందికి, 5 అగ్నిమాపక సిబ్బందికి, 7 సివిల్ డిఫెన్స్, హోంగార్డు సర్వీస్‌లకు 4 పతకాలు కరెక్షనల్ సర్వీసెస్ కి అందించనున్నట్లు తెలిపింది ప్రభుత్వం. తెలంగాణ నుంచి 21 మంది పోలీస్ సిబ్బంది ఎంపికైనట్లు సమాచారం. వీరిలో పోలీసు సిబ్బందిలో విశిష్ట సేవలకు 2, మెరిటోరియస్ సర్వీస్ కి 12, అగ్నిమాపక విభాగంలో మెరిటోరియస్ సర్వీస్ కి 3, హోంగార్డు విభాగంలో మెరిటోరియస్ సర్వీస్ 4 పతకాలు ఉన్నట్లు సమాచారం.

పతకాలకు అందుకోనున్న తెలంగాణ అధికారులు వీరే:

పోలీసు విభాగం:

కార్తికేయ, ఇన్‌స్పెక్టర్ జనరల్,
అన్నల ముత్యం రెడ్డి, పోలీసు సూపరింటెండెంట్,
కమల్ల రామ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్,
మహమ్మద్ ఫజ్లూర్ రెహమాన్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్,
కోటపాటి వెంకట రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్
అన్ను వేణుగోపాల్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్,
రణ్‌వీర్ సింగ్ ఠాకూర్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్,
పీటర్ జోసెఫ్ బహదూర్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్,
మహ్మద్ మొయినుల్లా ఖాన్, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్,
వద్యా పథ్యా నాయక్, హెడ్ కానిస్టేబుల్,
నుమల నిరంజన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్,
ఎండీ అయూబ్ ఖాన్, హెడ్ కానిస్టేబుల్

అగ్నిమాపక విభాగం:

వేంకటేశ్వర రావు మోరుబోయిన, లీడింగ్గ ÷ర్‌మెన్
సుబ్బయ్య చావల, లీడింగ్గ ÷ర్‌మెన్,
జనార్దన్ కారుకూరి, లీడింగ్గ ÷ర్‌మెన్,

హోంగార్డు విభాగం:

ఈశ్వరయ్య మంత్రి, హోమ్ గార్డ్
యాదగిరి మేడిపల్లి, హోమ్ గార్డ్
లక్ష్మణ్ కోమటి, హోమ్ గార్డ్
అయిలయ్య కల్యెంల, హోమ్ గార్డ్